క్లుప్తంగా

అండర్‌పాస్ ఇవ్వాలి


కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

ముదిగొండ: మండలంలోని ముదిగొండ, వెంకటాపురం, చిరుమర్రి గ్రామాల రైతులు పొలాలకు వెళ్లడానికి, రాకపోకలు సాగించడానికి కోదాడ – కురవి జాతీయ రహదారిపై అండర్‌పాస్ ఇవ్వాలని రైతులు శుక్రవారం ఖమ్మంలో కలెక్టర్ వీపీ గౌతమ్‌కు వినతిపత్రం అందజేశారు. అండర్‌పాస్ నిర్మాణం ఇవ్వకపోతే ఉన్న వ్యవసాయ భూములు పడావుపడే అవకాశం ఉందని వారు వినతిపత్రంలో పేర్కొన్నారు. పరిశీలించి అండర్‌పాస్ నిర్మించాలని రైతులు కోరారు. ఈ కార్యక్రమంలో వెంకటేశ్వర్లు, వీరబాబు, సుధాకర్, బాస్కరావు లు పాల్గొన్నారు.

ఏపీఎంకు మెమో

చింతకాని: విధుల్లో నిర్లక్ష్యం వహించినందుకు ఈజీఎస్ ఏపీఎం కోటయ్యకు ఎంపీడీఓ శ్రీనివాసరావు శుక్రవారం మెమో జారీ చేశారు. మండలంలోని చినమండవ గ్రామంలో జరుగుతున్న ఉపాధిహామీ పనులను పరిశీలించేందుకు ట్రైనీ కలెక్టర్ రాధికా గుప్త వచ్చారు. ఆ సమయంలో విధుల పట్ల అలసత్వంతో పాటు ఉపాధిహామీ పనులు జరిపించడంలో నిర్లక్ష్యం ప్రదర్శించటంతో మెమో జారీ చేసినట్లు తెలిపారు.

'మీల్స్ ఆన్ వీల్స్' ప్రారంభం


మీల్స్ ఆన్ వీల్స్ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్ జైపాల్

వైరా: వైరా లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మీల్స్ ఆన్ వీల్స్ కార్యక్రమాన్ని శుక్రవారం వైరా మాటూరుపేట కాలనీ చర్చి వద్ద మున్సిపల్ చైర్మన్ సూతకాని జైపాల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లయన్స్‌క్లబ్ వారు అందజేస్తున్న సేవలు అభినందనీయం అన్నారు. 11వ రోజు 200 మందికి అల్పాహారాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు చింతోజు నాగేశ్వరరావు, వెంకటేశ్వరరావు, రమేష్, హరిప్రసాద్, కృష్ణారావు, శ్రీను పాల్గొన్నారు.

అద్దె బస్సు డ్రైవర్లకు శిక్షణ


మాట్లాడుతున్న ఎంవీఐ వెంకటపుల్లయ్య

సత్తుపల్లిటౌన్: అద్దె బస్సు డ్రైవర్లు నిబంధనల మేరకు బస్సులు నడపాలని సత్తుపల్లి ఎంవీఐ సంఘం వెంకటపుల్లయ్య అన్నారు. స్థానిక ఆర్టీసీ డిపోలో అద్దె బస్సు డ్రైవర్లకు డిపో మేనేజర్ రాజ్యలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రయాణికుల పట్ల మర్యాదపూర్వకంగా నడుచుకుంటూ సురక్షిత డ్రైవింగ్ చూస్తూ మెరుగైన సేవలు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ విజయశ్రీ, సూపర్‌వైజర్ సుబ్బారావు, అద్దె బస్సు డ్రైవర్లు పాల్గొన్నారు.

ఏసీపీ సేవలు అభినందనీయం

సత్తుపల్లిటౌన్: సత్తుపల్లిలో నాలుగు సంవత్సరాలపాటు ఏసీపీ ఎన్.వెంకటేష్ అందించిన సేవలు అభినందనీయమని వక్తలు కొనియాడారు. పట్టణంలోని విద్యాభారతి జూనియర్ కళాశాలలో శుక్రవారం పాల్వంచ డీఎస్పీగా బదిలీపై వెళ్తున్న ఏసీపీను ప్రైవేట్ విద్యాసంస్థలు, స్వచ్ఛందసంస్థల ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పట్టణ ప్రముఖులు లింగారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, సోమిరెడ్డి, రమేష్, శ్రీనివాసరెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, మధు, సత్యనారాయణ, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు

మధిర: పట్టణంలోని శ్రీ గంగా పార్వతీ సమేత శ్రీ మృత్యుంజయ స్వామి ఆలయంలో ఈ నెల 5న నిర్వహించనున్న ధ్వజస్తంభ ప్రతిష్టా మహోత్సవాల సందర్భంగా శుక్రవారం ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. ఆలయంలో నూతనంగా నిర్మించిన ఆలయాల్లో వేద పండితులచే పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ నాగేశ్వరరావు దంపతులు, భక్తులు పాల్గొన్నారు.

రెడ్ కలర్ డే

మధిర: ఆత్కూరు సమీపంలోని శ్రీనిధి కాన్సెప్ట్ స్కూల్లో శుక్రవారం రెడ్ కలర్ డే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. శ్రీనిధి స్కూల్ కరస్పాండెంట్ బి.అంజన్ బాబు పాల్గొని మాట్లాడారు. ఇటువంటి కలర్స్ డే లను నిర్వహించడం వలన విద్యార్థులకు మానసిక వికాసం పెంపొందుతుందన్నారు. పాఠశాలలో ప్రతీ వారం ఇలాంటి కలర్ డే నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్, డైరెక్టర్ చందు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పేరుకే క్రీడా ప్రాంగణాలు

వసతుల లేమితో ఇబ్బందులు
- బోర్డులకే పరిమితమైన ప్రాంగణాలు
- 31 పంచాయతీల్లో 24 చోట్ల నిర్మాణాలు పూర్తి



ఊరికి దూరంగా ఏర్పాటు చేసిన రామాపురం క్రీడా మైదానం

గ్రామీణ ప్రాంతాల్లో ఆటలకు పెద్దపీట వేయాలని సర్కారు భావించింది. క్రీడాకారులకు ప్రోత్సాహం అందించాలనుకుంది. అందుకనుగుణంగా ప్రణాళికలు రూపొందించి పల్లెకో క్రీడా ప్రాంగణం ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. స్థలాలు కేటాయించాలని అధికారులను ఆదేశించింది. దీంతో కొన్ని చోట్ల ఆర్భాటంగా ఏర్పాటు చేశారు. మరికొన్ని చోట్ల స్థలాల కొరత ఉంది. ఇంకొన్ని చోట్ల పనులు ప్రారంభించలేదు.

ఎర్రుపాలెం: మండలంలోని గ్రామాల్లోని ప్రభుత్వ స్థలాల్లో ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణాలు మొక్కుబడిగానే కనిపిస్తున్నాయి. ఈ ప్రాంగణాల్లో ఏమాత్రం వసతులు కల్పించలేదు. వసతుల లేమితో క్రీడాకారులు పలు ఇబ్బందులకు గురవుతున్నారు. కేవలం బోర్డులకే పరిమితమైన క్రీడా ప్రాంగణాలు ప్రభుత్వ తీరును ,పాలకుల తీరును వెక్కిరిస్తున్నాయి. మండలంలోని 31 గ్రామ పంచాయతీలకు గానూ 24 పంచాయతీల్లో ప్రాంగణాలు ఏర్పాటు చేశారు. గట్లగౌరారం, రాజుపాలెం, నర్సింహాపురం, కాచారం, ఇనగాలి, లక్ష్మీపురం, ములుగుమాడు పంచాయతీ గ్రామాల్లో ప్రభుత్వ స్థలాలు లేకపోవడంతో క్రీడా ప్రాంగణాలు నిర్మించలేదు. మండలంలోని మాముసూరు, వెంకటాపురం, పెద్దగోపవరం గ్రామాల్లో ప్రభుత్వ స్థలాల్లో స్థలాలు లేకపోవడంతో జెడ్పీ పాఠశాలల్లో క్రీడా మైదానాలు ఏర్పాటు చేయాల్సివచ్చింది. సుమారు ఎకరం భూమిలో కబడ్డీ, ఖో–ఖో, వాలీబాల్ కోర్టులు, టూ పారాలాల్ ఎక్సర్‌సైజ్ బార్స్, సింగిల్ ఎక్సర్‌సైజ్ బార్, లాంగ్ జంప్ పిట్, మొక్కలు నాటడం లాంటివి క్రీడా ప్రాంగణాల్లో విధిగా ఉండాలి. క్రీడాకారులు ఆడుకునే రీతిలో వసతులు కల్పించాల్సివుంది. జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం ద్వారా పంచాయతీ నిధుల నుంచి వసతులు ఏర్పాటు చేయాలి. క్రీడాకారులు క్రీడల పట్ల ఆసక్తి చూపుతున్నప్పటికీ ఆ ప్రాంగణాల్లో వసతుల లేమితో అటు వైపు వెళ్లడం లేదు. పలు గ్రామాలోన్లి క్రీడాప్రాంగణాల్లో సర్గి మైదానాలు కూడా చదును చేయలేదు. గడ్డితో పాటు ముళ్లకంప, పిచ్చిచెట్లు సైతం బాగా మొలిచాయి. గత్యంతరం లేక అధ్వానంగా ఉన్న ఆ ప్రాంగణాల్లోనే క్రీడలు ఆడాల్సిన పరిస్థితి దాపురించింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి క్రీడా ప్రాంగణాలు పూర్తిస్థాయిలో చదును చేసి వసతులు కల్పించాలని క్రీడాకారులు ముక్తకంఠంతో కోరుతున్నారు. మొక్కుబడిగా ఎందుకు క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేశారని పలువురు ప్రశ్నిస్తున్నారు.

పీఈటీలు లేక కొరవడిన అవగాహన..

పాఠశాల స్థాయిలో క్రీడల పట్ల ప్రభుత్వం పీఈటీలతో అవగాహన కల్పించాల్సి ఉంది. ప్రాథమిక స్థాయిలోనే వ్యాయామ విద్యకు ప్రాధాన్యత ఇవ్వాల్సి ఉన్నప్పటికీ ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదు. రేమిడిచర్ల, జమలాపురం, రామన్నపాలెం జెడ్పీ పాఠశాలల్లో పీఈటీల పోస్టుల ఖాళీగా ఉన్నాయి. దీంతో ఈ పాఠశాల క్రీడల పట్ల ప్రోత్సాహం కొరవడింది. దశాబ్దాల తరబడిగా పీఈటీల నియామకం లేదు. ఈ విషయంలో ఎస్ఎంసీ కమిటీలు, తల్లిదండ్రులు ప్రభుత్వానికి చేసిన వినతులు బుట్టదాఖలవుతున్నాయి. ఓ వైపు క్రీడలకు బాగా ప్రోత్సాహం కల్పిస్తున్నట్లుగా చెబుతున్న పాలకులు పీఈటీల నియామకంలో నిర్లక్ష్యం చేస్తున్నారు.

వసతులు కల్పించాలి..


మండలకేంద్రంలోని తహసీల్ వెనుక ఏర్పాటు చేసిన ప్రాంగణంలో సరిగ్గా వసతులు లేవు. మైదానం కూడా చదునుగా లేదు.. పలు చోట్ల గుంతలున్నాయి. క్రీడలకు అవసరమైన సామగ్రి లేదు. ముళ్ల కంప, గడ్డి, పిచ్చిమొక్కలు మొలుస్తున్నాయి. ఈ ప్రాంగణంలోనే సమయం దొరికినప్పుడల్లా ఆటలు ఆడుకుంటాం. ప్రభుత్వం ఇంకా మెరుగైన వసతులు కల్పిస్తే బాగుంటుంది.

– నంద్రు నాగరాజు, క్రీడాకారుడు, ఎర్రుపాలెం

అప్పడే అవగాహన ..


పాఠశాలల్లో పీఈటీలుంటే క్రీడల పట్ల విద్యార్థుల్లో అవగాహన పెరుగుతుంది.కొన్ని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో దశాబ్దాలుగా పీఈటీ పోస్టులు ఖాళీగానే ఉన్నాయి.

దీంతో ఆ పాఠశాల విద్యార్థులకు క్రీడల పట్ల అవగాహన లేకుండా పోతుంది. విద్యార్థుల్లో నైపుణ్యత లేకుండా ఉంది. పాఠశాలల్లో పీఈటీల నియామకం చేస్తే బాగుంటుంది.

– జీవీ సత్యనారాయణరెడ్డి, పీఈటీ, భీమవరం

రూ.56 వేల వరకు ఖర్చు చేశాం..


మండలంలోని 24 పంచాయతీల్లో క్రీడా ప్రాంగణాలను ఈజీఎస్ నిధులతో ఏర్పాటు చేశాం. ఒక్కో క్రీడా మైదానానికి రూ.31 వేల నుంచి 56 వేల వరకు ఖర్చు చేశాం. ఆరంభంలో నిర్దేశించిన మేరకు వసతులు ఏర్పాటు చేయడం జరిగింది. ప్రాంగణాల నిర్వహణలో కొంత ఇబ్బందిగా ఉంది. కొన్ని ప్రభుత్వ స్థలాలు ఊరికి దూరంగా ఉండటంతో వినియోగించడం లేదు.

– బి.శ్రీనివాసరావు, ఎంపీడీఓ, ఎర్రుపాలెం

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ


చింతకాని: వరలక్ష్మికి చెక్కు అందిస్తున్న వెంకటేశ్వర్లు

చింతకాని/ఎర్రుపాలెం: మండలంలోని మత్కేపల్లి గ్రామంలో లబ్ధిదారురాలు గోద వీరలక్ష్మికి శుక్రవారం కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు అంబటి వెంకటేశ్వర్లు సీఎం సహాయ నిధి చెక్కును అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అనారోగ్యంతో బాధపడుతున్న వీరలక్ష్మికి వైద్య ఖర్చుల నిమిత్తం రూ.18 వేల చెక్కును అందించడం జరిగింది. ఎర్రుపాలెం మండలంలోని ఇనగాలి, వెంకటాపురం, తక్కెళ్లపాడు, బుచ్చిరెడ్డిపాలెం, మీనవోలు, పెద్దగోపవరం, లక్ష్మీపురం, రాజులదేవరపాడు తదితర గ్రామాలకు చెందిన 9మంది లబ్ధిదారులకు మండలకేంద్రంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి రూ.2.33లక్షల విలువైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నాగార్జున్, నాయకులు కోటేశ్వరరావు, రామారావు, రామకోటేశ్వరరావు, శ్రీనివాసరావు, రమేష్‌బాబు, లింగయ్య, బ్రహ్మచారి, వెంకయ్య, వెంకటనారాయణ, ప్రసాద్, నాయకులు నర్సింహారావు, శ్రీనివాసరావు, శ్రీను, వేమిరెడ్డి అరవింద్‌రెడ్డి, ఎస్‌కే ఇస్మాయిల్, రాజేష్, వెంకటనర్సయ్య, బాబురావు, రాజీవ్‌గాంధీ, బోస్, అనీల్‌కుమార్ పాల్గొన్నారు.

బీమా నగదు..

ఎర్రుపాలెం: మండలంలోని భీమవరం గ్రామానికి చెందిన షేక్ రబ్బానీ ఇటీవల మృతి చెందాడు. ఈయన పేరిట అయ్యవారిగూడెం సొసైటీలో గ్రూపు బీమా చేయించారు. శుక్రవారం మండల కేంద్రంలోని కోఆపరేటివ్ బ్యాంకులో మృతుని పేరిట మంజూరైన రూ.50వేల నగదును మృతుని భార్య ఫర్జానాకు బ్యాంకు మేనేజర్ మగినం వీరభద్రం, సొసైటీ చైర్మన్ అనుమోలు సాంబశివరావులు అందజేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ నాగలక్ష్మి, సూపర్‌వైజర్ మహేష్, సొసైటీ సీఈఓ మోహన్‌రావు, సొసైటీ సిబ్బంది మురళీకృష్ణ, రమణారెడ్డి తదితరులున్నారు.

సబ్‌జైల్ సూపరింటెండెంట్‌గా ప్రవీణ్

సత్తుపల్లిటౌన్: సత్తుపల్లి సబ్‌జైల్ సూపరింటెండెంట్‌గా శుక్రవారంఎస్.ప్రవీణ్ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేస్తున్న సూపరింటెండెంట్ హనుమంతురావు ఖమ్మంకు బదిలీ కాగా.. పరకాల నుంచి ప్రవీణ్ బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్ జైల్ సూపరింటెండెంట్ ప్రవీణ్‌కు మొక్కను అందించి సత్కరించి అభినందనలు తెలిపారు.

ట్రాన్స్‌ఫార్మర్‌లో కాపర్ వైరు చోరీ

కొణిజర్ల: అమ్మపాలెంకు చెందిన జడ శ్రీను వ్యవసాయ పొలం సమీపంలో ఏర్పాటు చేసిన 25 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌ను గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. ఈ మేరకు రైతులు శుక్రవారం ఏఈ సురేష్‌కు సమాచారం అందించడంతో సంఘటనా స్థలానికి చేరుకున్నారు. అక్కడ పరిస్థితిని పరిశీలించిన అనంతరం కొణిజర్ల పోలీసులకు ఫిర్యాదు చేశారు. పొలాల వెంట ఎవరైనా అనుమానస్పదంగా కనిపిస్తే తక్షణమే విద్యుత్, పోలీస్ అధికారులకు సమాచారం అందించాలని తెలిపారు.

ఏసీడీ చార్జీలు రద్దు చేయాలి

కొణిజర్ల: ట్రాన్స్‌కో సమాన్యులపై విధిస్తున్న ఏసీడీ చార్జీలు తక్షణమే ఉపసంహరించుకోవాలని, వ్యవసాయానికి ఉదయం సమయంలో త్రీఫేజ్ విద్యుత్ సరఫరా చేయాలని సీపీఐ జిల్లా నాయకుడు యర్రా బాబు, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు దొండపాటి రమేష్ డిమాండ్ చేశారు. ఏసీడీ చార్జీలను నిరశిస్తూ శుక్రవారం కొణిజర్ల ట్రాన్స్‌కో కార్యాలయం ఎదుట సీపీఐ, తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి ఏఈకి వినతిపత్రం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల నాయకులు స్వర్ణ రమేష్, సోమయ్య, సీతారాములు, పుల్లయ్య, వెంకయ్య, వెంకటేశ్వర్లు, రామారావు, ఆదిరెడ్డి, శ్రీను, బాబు, నరసింహారావు, భాస్కరరావు, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

మహాసభలను విజయవంతం చేయాలి

బోనకల్: ఈ నెల 5న సాయిబాబా కల్యాణ మండపంలో జరిగే విశ్వబ్రాహ్మణ సంఘం మండల మహాసభను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు అద్దంకి నాగేశ్వరరావు కోరారు. మండల కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటులో విశ్వబ్రాహ్మణులు ముఖ్య భూమిక పోషించారని, 28 మంది ప్రాణాలు అర్పించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు సత్యనారాయణ, శ్రీనివాసరావు, కృష్ణమాచారి, శ్రీనివాస్, వెంకటాచారి తదితరులు పాల్గొన్నారు.

సేవాలాల్ జయంతిని సెలవు దినంగా ప్రకటించాలి

కారేపల్లి: లంబాడాల ఆరాధ్యదైవం సంత్ సేవాలాల మహరాజ్ జయంతిని ప్రభుత్వం సెలవు దినంగా ప్రకటించాలని ఎల్‌హెచ్‌పీఎస్ నంగారాభేరి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మత్రు నాయక్, గుగులోత్ ప్రసాద్‌నాయక్‌లు డిమాండ్ చేశారు. శుక్రవారం ఎల్‌హెచ్‌పీఎస్ ఆధ్వర్యంలో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఫిబ్రవరి – 19న సుందరయ్య విజ్ఞానకేంద్రంలో నిర్వహించే సేవాలాల్ జయంతి వేడుకలను జయప్రదం చేయాలన్నారు. అనంతరం జయంతి ఉత్సవాల కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో ఎల్‌హెచ్‌పీఎస్ మహిళ జిల్లా అధ్యక్షురాలు విజయబాయి, రమేష్‌నాయక్ పాల్గొన్నారు.

విశ్వకర్మ జయంతి వేడుకలు

కొణిజర్ల: మండలంలోని పల్లిపాడులో విశ్వబ్రాహ్మణులు విశ్వకర్మ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వకర్మ చిత్రపటానికి పలువురు విశ్వబ్రాహ్మణులు పూలమాలలేసి నివాళులు అర్పించారు. అనంతరం కేంద్ర బడ్జెట్‌లో విశ్వకర్మల సంక్షేమం కోసం పీఎం విశ్వకర్మ పథకాన్ని ప్రవేశ పెట్టనందుకు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణులు నాగబ్రహ్మచారి, శ్రీనివాసచారి, నరసింహాచారి, ముత్తాచారి, బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ బలోపేతమే లక్ష్యం

తల్లాడ: బీజేపీ బలోపేతానికి కార్యకర్తలు కలిసికట్టుగా కృషి చేయాలని బీజేపీ జిల్లా నాయకుడు బండారి నరేష్ అన్నారు. తల్లాడలో బీజేపీ మండల అధ్యక్షుడు ఆపతి వెంకటరామారావు అధ్యక్షతన నిర్వహించిన ముఖ్యనాయకులు, పదాధికారుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మండలంలో బూత్ కమిటీలను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. రాబోయే ఎన్నికల్లో బీజేపీ జెండా ఎగరవేయడం ఖాయమని అన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు గల్లా సత్యనారాయణ, తేజావత్ బాలాజీ నాయక్, కృష్ణారావు, దళిత మోర్చా అధ్యక్షుడు సురేష్, రమేష్, అశోక్ పాల్గొన్నారు.

'చలో హైదరాబాద్'ను జయప్రదం చేయండి


సత్తుపల్లి రూరల్: కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి రామకృష్ణ

సత్తుపల్లిరూరల్/కల్లూరు: మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యల పరిష్కారానికై ఈ నెల 8న హైద్రాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద జరిగే ధర్నాను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి నిమ్మటూరి రామకృష్ణ, ఏఐటీయూసీ ఉపాధ్యక్షుడు వేము రాంబాబు కోరారు. ఈ మేరకు శుక్రవారం కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత అసెంబ్లీలో ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటించిన రూ.3వేల గౌరవ వేతనాన్ని ఏరియల్‌తో సహా చెల్లించాలని, కోడిగుడ్లు ప్రభుత్వమే ఇవ్వాలని, వంటగ్యాస్ సరఫరా చేయడంతోపాటు కార్మికులకు ఈఎస్ఐ, పీఎఫ్, ప్రమాద బీమా సౌకర్యాలు కల్పించాలన్నారు. ఆరు నెలలుగా పెండింగ్‌లో ఉన్న కోడిగుడ్డు బిల్లులు, వేతనాలు తక్షణమే విడుదల చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ మండల అధ్యక్షుడు తెలగారపు రామారావు, ఎం.లక్ష్మి, కె.కృష్ణమ్మ, టి.కనకదుర్గ, ఎస్.కృష్ణవేణి, నాయకులు వెంకటనారాయణ, దామాల దయాకర్, పాగా సత్యవతి, మారెమ్మ, అలివేలు, తిరుపతమ్మ, జ్యోతి, పద్మ, చిట్టెమ్మ, అప్సరాబి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు తీవ్ర అన్యాయం


సత్తుపల్లిరూరల్: కూలీలతో మాట్లాడుతున్న దండు ఆదినారాయణ

సత్తుపల్లిరూరల్/ముదిగొండ: కేంద్ర బడ్జెట్‌లో ఉపాధిహామీ పథకానికి తీవ్ర అన్యాయం జరిగిందని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ దండు ఆదినారాయణ, వ్యవసాయ కార్మికసంఘం మండల కార్యదర్శి వేల్పుల భద్రయ్య అన్నారు. ఈ సందర్భంగా ముదిగొండలో వ్యవసాయ కార్మికసంఘం ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. సత్తుపల్లి మండలం రేజర్ల గ్రామంలో శుక్రవారం దండు ఆదినారాయణ వ్యవసాయ కూలీలతో మాట్లాడారు. నిజంగా మోదీకి పేదలు, కూలీలపై ప్రేమ ఉంటే దేశంలో ఉపాధిహామీ పథకానికి కనీసం లక్షన్నర కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. కూలీలకు 200 రోజులు పనిదినాలు కల్పించి రూ.600 వేతనం చెల్లించాలన్నారు. కార్యక్రమంలో కనకమ్మ, రాములమ్మ, సుశాంతి, మేరి, వెంకటమ్మ, లక్ష్మి, రాజేశ్వరి, జాన్సీ మేరమ్మ, సీపీఎం మండల కార్యదర్శి పురుషోత్తం, నాయకులు సాయి, సైదులు, సుధాకర్, రమేష్, ఉపేందర్, నాగేశ్వరరావు, రాజు తదితరులు పాల్గొన్నారు.

బడ్జెట్‌లో విద్య, వైద్యానికి నిధులు కేటాయించాలి..

ఏన్కూరు: ఈ నెల 6న జరగనున్న అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో విద్య, వైద్యానికి అధిక నిధులు కేటాయించాలని ఎంపీపీ వరలక్ష్మి కోరారు. మండల కేంద్రంలో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. పాఠశాలలు, కళాశాలల్లో మౌళిక వసతులు కల్పించాలని, ఏన్కూరులో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని కోరారు. ఈ సమస్యలపై మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్‌కు లేఖ రాసినట్లు తెలిపారు.

కారేపల్లిలో ఆక్రమణల తొలగింపు


దోజర్‌ను అడ్డుకుంటున్న చిరు వ్యాపారులు

కారేపల్లి: రోడ్డుపైన వ్యాపారాలు సాగించే వారి సముదాయాలను కారేపల్లి కార్యదర్శి యాకలక్ష్మి ఆధ్వర్యంలో పంచాయతీ సిబ్బంది తొలగించారు. ఆర్‌అండ్‌బీ రోడ్డుపైన వ్యాపారాలు సాగిస్తున్నారని జీపీ సబ్బందితో కూరగాయలు, ట్రేలను ట్రాక్టర్‌లో వేస్తుండడంతో చిరు వ్యాపారులు ఆగ్రహించి అధికారులతో వాగ్వాదానికి దిగారు. ఆక్రమణల తొలగింపు అంటూ, అధికారులు ఇష్టం వచ్చినట్లు చేస్తున్నారని ఆరోపించారు. పంచాయతీ కానీ, ఆర్‌అండ్‌బీ కానీ ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా దౌర్జన్యం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలో ఒకవైపు నుంచి తొలగింపులు చేపట్టాల్సి ఉండగా బస్టాండ్ సెంటర్‌కు వచ్చి, షాపులను కూల్చివేయడం ఏమిటని చిన్నవ్యాపారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. రైల్వేస్టేషన్ రోడ్డులోని వ్యాపారులు పంచాయతీ ట్రాక్టర్‌కు అడ్డుగా పడుకోని, నిరసన తెలిపారు. పరిస్థితి ఉద్రిక్తతంగా మారడంతో విషయం తెలుసుకున్న ఎంపీడీఓ చంద్రశేఖర్, ఎస్సై పుష్పాల రామారావు ఆ ప్రాంతానికి చేరుకుని వ్యాపారస్తులతో మాట్లాడారు. రోడ్డు పక్కన ఉన్న సైడ్ డ్రెయినేజీ కాలువ దాటి వ్యాపారాలు నిర్వహించొద్దన్నారు. లేని యెడల చర్యలు తప్పవన్నారు.

ఆదరణ ఓర్వలేకే అసత్య ఆరోపణలు


సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

తల్లాడ: ప్రజాక్షేత్రంలో మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డికి పెరుగుతున్న ఆదరణను తట్టుకోలేక బీఆర్ఎస్ నాయకులు అసత్యపు ఆరోపణలు చేస్తున్నారని పొంగులేటి వర్గం నాయకులు గోపిశెట్టి వెంకటేశ్వరరావు, గణేశుల రవి, యర్రి నరసింహారావు, తూము వెంకటనారాయణ, తుమ్మలపల్లి రమేష్ పేర్కొన్నారు. తల్లాడలో శుక్రవారం వారు మాట్లాడుతూ శ్రీనివాసరెడ్డి పార్టీకి ద్రోహం చేశారని చెబుతున్న నేతలు అసలు నిజాలు గుర్తించాలని హితవు పలికారు. వేలాది మంది కష్టసుఖాల్లో పాలు పంచుకున్న పొంగులేటిపై అసత్య ఆరోపణలు మానుకోవాలని, లేనిపక్షంలో ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని అన్నారు. ఈ సమావేశంలో తూము వెంకటనారాయణ, గొడుగునూరి లక్ష్మీరెడ్డి, ఏరువ గోపాల్‌రావు, దొడ్డా రామకృష్ణ, బూరుగు శ్రీను, మీర్జా మహబు, మాగంటి శ్రీనువాసరావు, బండారు ఏడుకొండలు, నరేష్, బాలకృష్ణ, కటికాల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

వృథాగా మిషన్ భగీరథ నీరు


మిషన్ భగీరథ నీరు వృథాగా పోతున్న దృశ్యం

ఏన్కూరు: ప్రతి ఇంటికి స్వచ్ఛమైన తాగు నీరు అందించాలనే లక్ష్యంతో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పెద్ద మొత్తంలో నిధులు ఖర్చు చేస్తోంది. కానీ తాగు నీటి వృథాను అరికట్టడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. వారి నిర్లక్ష్యం కారణంగా నీరు వథాగా పోతున్నాయి. ఏన్కూరు మండల కేంద్రంలోని టీయల్‌పేట రోడ్డులో నరేష్ చికెన్ సెంటర్ ఎదుటు డ్రెయినేజీ కోసం జనవరి 31న కాలువ తవ్వారు. ఈ క్రమంలో భగీరథ పైపు పగిలి నీరు పోతుంది. ఈ విషయమై మిషన్‌భగీరథ అధికారులకు, పంచాయతీ అధికారులకు సమాచారం ఇచ్చినప్పటికీ ఇప్పటి వరకు స్పందించలేదు. ఈ దారి గుండా ప్రయాణించేవారికి రాకపోకలు నిలిచిపోయాయి. మండలకేంద్రంలోనే సమస్యలు పరిష్కరించకపోతే.. ఇక మారుమూల గ్రామాలను ఏం చేస్తారోనని పలువురు అంటున్నారు. కనీసం ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈ సమస్యను పరిష్కరించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

వైరాలో ఉచిత వైద్య శిబిరం

వైరా: వైరాలోని 1వార్డులో ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరాన్ని స్థానిక వార్డు కౌన్సిలర్ మరికంటి డీడీకుమారి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ప్రజలంతా ఆరోగ్యంగా ఉండాలనే లక్ష్యంతో సీఎం కేసీఆర్ పల్లె, బస్తీ దవాఖానాలు ఏర్పాటు చేస్తున్నారన్నారు. ఈ సందర్భంగా కొణిజర్ల ఆయుర్వేద వైద్యాధికారి సమదియా, డాక్టర్ కీర్తనలు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచిత ఆయుర్వేద మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌వీ రోజారాణి, ఏఎన్ఎం సుగుణ, ఆయుష్ సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

గర్భకోశ వ్యాధులకు చికిత్స..


గేదెకు వైద్యం అందిస్తున్న వైద్యుడు

వైరారూరల్: మండలంలోని కోస్తాల గ్రామంలో పశుసంవర్ధకశాఖ, పశుగాణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం పశువులకు గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని సర్పంచ్, ఉపసర్పంచులు మంచాల జయరావు, ఈవూరి ఆదిలక్ష్మి ప్రారంభించారు. అనంతరం పశువైద్యాధికారి ఎం.రాకేష్‌కుమార్ 23 పశువులకు గర్భకోశ వ్యాధులకు చికిత్స చేశారు. కార్యక్రమంలో గోపాల మిత్ర సూపర్‌వైజర్ లక్ష్మణాచారీ, సురేష్, ప్రకాష్, గోపాలమిత్రులు తదితరులు పాల్గొన్నారు.

'కంటి వెలుగు'ను ప్రారంభించిన ఎంపీపీ

తల్లాడ: మండలంలోని అంబేద్కర్ నగర్‌లో శుక్రవారం కంటి వెలుగు కార్యక్రమాన్ని తల్లాడ ఎంపీపీ దొడ్డా శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ జొన్నలగడ్డ కిరణ్ అధ్యక్షతన జరిగిన సభలో ఆయన మాట్లాడారు. దేశంలోనే అద్భుత పథకంగా కంటి వెలుగును వర్ణించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ బి.రవీంద్రరెడ్డి, మండల వైద్యాధికారి రత్న మనోహర్, సీహెచ్ఓ భాస్కర్, సూపర్‌వైజర్ పెద్ద పుల్లయ్య పాల్గొన్నారు.

టీపీసీసీ సభ్యుడు రామ్మూర్తి పర్యటన

ఏన్కూరు: మండలంలో టీపీసీసీ సభ్యుడు ధరావత్ రామ్మూర్తి నాయక్ శుక్రవారం సుడిగాలి పర్యటన చేశారు. మండలంలోని పైనంపల్లి తండా గ్రామంలో ధరావత్ మత్రు ను పరామర్శించారు. ధరావత్ మత్రు మిర్చిబస్తాలను గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించారు. విషయం తెలుసుకున్న రామ్మూర్తినాయక్ అతన్ని కలిసి ఆర్థిక సాయం చేశారు. పోలీసులకు ఫోన్ చేసి మిర్చి దొంగలను పట్టుకోవాలన్నారు. తిమ్మారావుపేటలో ఇటీవలె మృతి చెందిన షేక్ జానీ కుటుంబాన్ని పరామర్శించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు లచ్చిరాం నాయక్, మాళోతు నర్సింహరావు, ధరావత్ హరిసింగ్, బాణోత్ సైదులు తదితరులు పాల్గొన్నారు.

లయన్స్‌క్లబ్ వితరణ



వీల్ చైర్ అందజేస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు

వైరా: వైరాకు చెందిన చీదిరాల శ్రీను అనే దివ్యాంగుడికి వైరా గ్రేటర్ విజన్ లయన్స్‌క్లబ్ వారు వీల్ చైర్ అందించారు. అమెరికాలో నివాసం ఉంటున్న ప్రముఖ కార్డియాలజిస్ట్ డాక్టర్ పూనాటి అప్పారావు జన్మదినాన్ని పురస్కరించుకుని ఈ వీల్‌చైర్‌ను అందించడం జరిగింది. ఈ సందర్భంగా పీడీజీ డాక్టర్ కాపా మురళీ కృష్ణ మాట్లాడుతూ.. శుభోదయం ట్రస్ట్ ద్వారా 100 మంది నిరుపేద విద్యార్థులకు సాయం అందించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ కాపా చంద్రకళ, జీఎంటీ కోఆర్డినేటర్ డాక్టర్ ఉంద్రు శ్యాంబాబు, రాణి, ప్రభాకర్, శ్రీకాంత్, కిషన్‌రాయ్, గోపాలరావు, ఆదిలక్ష్మి, వంశీ తదితరులు పాల్గొన్నారు.